
కథ



# వాలుజడ

గన్నవరపు నరసింహమూర్తి

అది న్యూ యార్క్‌లోని కార్లు తయారు చేసే మల్టీ-నేషనల్ కంపెనీ హెడ్‌క్వార్టర్స్ ఆఫీస్. అందులో శ్రీరామ్ డిజైన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆ రోజు సెమినార్‌లో ఉండగా, అతనికి ఇండియా నుంచి ఫోన్ వచ్చింది.

అది తన ఇంటి నుంచి, ఆపరేటర్‌కు కనెక్షన్ ఇమ్మని చెప్పాడు.

మళ్లీ రెండు-మూడు సంబంధాలు చూశాననీ. ఈ సారి కుదిరిపోవచ్చనీ, వెంటనే ఒక నెల రోజులు సెలవు పెట్టుకుని రమ్మనీ అతని తల్లి సువర్చల మాట్లాడింది. 'అలాగే చూస్తా'నని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

ఆ ఫోన్ వచ్చిన తర్వాత శ్రీరాంకి చాలా చికాకుగా ఉంది. ఈ పెళ్లి విషయమై ఇండియాకి వెళ్లడం, కుదరక వెంటనే రావడం -ఒక పెద్ద ఫార్స్‌గా తయారైంది. ఇప్పటికే రెండుసార్లు వెళ్లాడు తను. కానీ తనకు నచ్చిన అమ్మాయి దొరకటం లేదు. రాను రాను ఈ సమస్య చాలా క్లిష్టంగా మారబోతోంది. తనకు కావలసిన అమ్మాయి అసలు దొరుకుతుందా?

తనకు ఇంజినీరింగ్ చదువుకున్నప్పటినుంచి ఒకటే కోరిక. అమ్మాయి బాపు బొమ్మలా ఉండాలి. ముఖ్యంగా పొడవైన వాలుజడ. "చకచకలాడే పిరుదులు దాటే జడను చూస్తే చలాకి ముద్దు" అన్న ఘంటసాల పాట అంటే చిన్నప్పటి నుంచి తను చెవికోసుకుంటాడు. బహుశా దాని వల్లే తనకలాంటి కోరిక కలిగిందేమో! ప్రతీ కార్టూన్‌లో, ప్రతీ వారపత్రిక ముఖచిత్రంలో బాపు గీసిన ముద్దుగుమ్మల చిత్రాలనూ, వాటికి బాపు గీసిన పొడవైన వాలుజడను చూసిన తరువాత, ఆ కోరిక మరింత బలపడింది.

కాలేజీలో చదువుతున్నప్పుడు ఎన్నో కలలు కనేవాడు తను, ఎప్పుడైనా సరే, ఆ పొడవైన వాలుజడ వున్న అమ్మాయే తన భార్య కావాలి. ఆ కలల రాకుమారికై ఎన్నేళ్లయినా తను వేచి ఉంటాడు. ఇంజినీరింగ్ అవగానే అమెరికాలో ఈ కార్ల కంపెనీలో ఉద్యోగం రావడంతో వెంటనే చేరిపోయాడు. అప్పటి నుంచి అతని ఇంటి నుంచీ రోజూ ఫోన్‌ల మీద ఫోన్‌లు. పెళ్లి చేసుకోమని ఒకటే ఒత్తిడి. తను కొన్నాళ్లు ఆగుతానంటే వింటేనా!? చివరకు తన తండ్రి కూడా ఫోన్ చేసి, "నువ్వు వెంటనే ఇండియా వచ్చి పిల్లల్ని చూసి నచ్చితే పెళ్లి ఏర్పాట్లు చేస్తాం" అని చెప్పడంతో, సంవత్సరం క్రితం సెలవు పెట్టుకొని ఇండియా వెళ్లలాడు.

వెళ్లినప్పట్నుంచీ అమ్మాయిల చూపులు ప్రారంభమయ్యాయి. మొదటగా చూసిన సంబంధం బానే ఉంది. ఆ అమ్మాయి కూడా ఇంజినీరింగ్ చదివింది. తెల్లగా ఆకర్షణీయంగానే ఉంది. కానీ ఒకటే లోటు. ఆమెది బాబ్ హెయిర్ పోనీ టెయిల్. నేటి మన తెలుగు సినిమా హీరోయిన్‌లా ఉంది.

సువర్చలకేమో ఆ అమ్మాయి తెగ నచ్చేసింది. "ఏరా! అమ్మాయి బాగుంది కదూ, తెల్లగా ముద్దుగా ఉంది. బాగా చదువుకుంది. సంప్రదాయకుటుంబం, కట్నం కూడా బాగానే ఇస్తారట. నువ్వు 'ఊ' అనడమే తరువాయి, ముహూర్తాలు పెట్టేస్తాం" అంది.

కానీ తనే 'ఊ' అనలేదు. దాంతో ఆమె చాలా దిగాలు పడిపోయింది.

మరో నాలుగు రోజుల తరువాత ఇంకో సంబంధం వచ్చింది. వాళ్లు బాగా ఉన్నవాళ్లు. మాజీమంత్రి గారి అమ్మాయి. కానీ పిల్లను చూస్తే చాలా భయంకరంగా ఉంది. నల్లని రూపం, దానికి తోడు మనిషి లావుగా ఉంది. పెదాలకు పెయింట్ పూసినట్లు లిప్ స్టిక్, బాబ్డ్ హెయిర్, సెక్సీగా వేసుకున్న దుస్తులు. తనకు మొదటి చూపులోనే నచ్చలేదు. అమ్మకి కూడా ఆ సంబంధం నచ్చలేదు.

ఇంక తనకి విసుగేసింది. సంతలో ఆవుల్ని చూసినట్లు ఈ పెళ్లి చూపుల ప్రహసనాలు నచ్చక, అమ్మతో చెప్పేశాడు, తను సెలవు

కాన్సిల్ చేసుకుని అమెరికా వెళ్లిపోతానని. ఆమె కూడా చేసేది లేక సరేనంది. కానీ ఆ రాత్రి తన మేనమామ ఫోన్ చేసి, ఒక మంచి సంబంధం ఉందనీ, మరునాడు తనొచ్చి అన్ని విషయాలూ మాట్లాడతానని చెప్పడంతో, తన ప్రయాణం మళ్లీ వాయిదా పడింది.

ఎదురుగా ఆమె.. తను పెళ్లిచూపుల్లో చూసిన అమ్మాయీ, వాళ్ల అమ్మా, చీరలు చూస్తున్నారు. తనను వారు గమనించినట్లు లేరు. కానీ... ఆ అమ్మాయి ఉదయం చూసిన అమ్మాయిలా లేదు. ఇప్పుడు అలంకరణంతా మారిపోయింది. జీన్స్ పాంట్, షర్ట్, పెదవులకు లిప్ స్టిక్, ముఖ్యంగా పొడవైన జడ స్థానంలో వదులు గా ఉన్న పొట్టి జుట్టు.
అతని మెదడు మొద్దు బారిపోయింది. ఉదయం అలంకరణంతా కేవలం పెళ్లిచూపుల కోసమేనన్నమాట! ఆ జడ కూడా సవరమే నన్నమాట! తను మోసపోయాడు. తనని వాళ్లు గమనించ కుండా ఇంటికొచ్చేశాడు.

తెల్లవారేసరికి మేనమామా, మరో వ్యక్తీ ఇంటికొచ్చారు. అతనే పిల్ల తండ్రనీ, అతను ఆ ఊరి ఆర్ట్స్ కాలేజీలో లెక్చరర్ అనీ, పిల్ల ఎమ్మెస్సీ చదువుతోందనీ, అందంగా ఉంటుందనీ చెప్పడంతో, మర్నాడే పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు. ఈ సారి పెళ్లిచూపులకు తనూ, అమ్మే వెళ్లారు.

ఇల్లు చాలా సింపుల్‌గా ఉంది. ఆ ఇంటి వాతావరణం చూస్తే, వాళ్లది చాలా సంప్రదాయకుటుంబం అని తెలిసిపోతూంది. వెళ్లిన అరగంటకు అమ్మాయిని తీసుకొచ్చి తన ఎదురుగా కూర్చోబెట్టారు. ఆమె కూర్చున్న పది నిమిషాలకు ఆమె ముఖం చూసే భాగ్యం కలిగింది తనకు. అందంగా పాలరాతి బొమ్మలా ఉంది. బాపు బొమ్మకి ఈ అమ్మాయే ప్రేరణేమో అన్నంత బావుంది. ముక్కుపుడక, కంఠానికి ఇంద్రధనుస్సులా నెక్లెస్, ఎత్తైన కొండ మీద నుంచి ఉరుకుతున్న జలపాతంలా పాపిడి చేరు. నుదుట తిలకం, బొట్టు. అన్నిటికన్నా ముఖ్యంగా పొడవాటి జడ, జడలో మల్లెల దండ. అందమంతా రాశి పోసినట్లుంది. ఇన్నాళ్లకు తను కలలు కన్న రాకుమారి దొరికిందనుకున్నాడు తన అన్వేషణ ఫలించింది.



పెళ్లి చూపులు ముగిసిన వెంటనే ఆ అమ్మాయి తనకు నచ్చిందని చెప్పేశాడు. మంచి రోజు చూసి మిగతావిషయాలూ, ముహుర్తాల గురించి మాట్లాడమన్నాడు.

ఆ సాయంత్రం తను షాపింగ్‌కని మార్కెట్‌కి వెళ్లాడు చాలా రోజుల నుంచి అమ్మకి పట్టుచీర కొనాలనుకుంటున్నాడు. ఇన్నాళ్ళకి కుదిరింది. తనకు ఇష్టమైన రంగు కుదరటం లేదు. ఇంతలో వెనుక నుంచి ఎక్కడో విన్న మాటలలా అనిపించి, వెనుదిరిగి చూశాడు.

ఎదురుగా ఆమె.. తను పెళ్లిచూపుల్లో చూసిన అమ్మాయీ, వాళ్ల అమ్మా, చీరలు చూస్తున్నారు. తనను వారు గమనించినట్లు లేరు. కానీ... ఆ అమ్మాయి ఉదయం చూసిన అమ్మాయిలా లేదు. ఇప్పుడు అలంకరణంతా మారిపోయింది. జీన్స్ పాంట్, షర్ట్, పెదవులకు లిప్ స్టిక్, ముఖ్యంగా పొడవైన జడ స్థానంలో వదులుగా ఉన్న పొట్టి జుట్టు.

అతని మెదడు మొద్దు బారిపోయింది. ఉదయం అలంకరణంతా కేవలం పెళ్లిచూపుల కోసమేనన్నమాట! ఆ జడ కూడా సవరమే నన్నమాట! తను మోసపోయాడు. తనని వాళ్లు గమనించకుండా ఇంటికొచ్చేశాడు.

ఆ పైన దీర్ఘంగా ఆలోచించసాగాడు.

అయిపోయింది... తన కల మంచులా కరిగిపోయింది. ఇక జన్మకి తనకు కావలసిన అమ్మాయి... ముఖ్యంగా పొడవైన వాలుజడ ఉన్న అమ్మాయి దొరకదేమో!

విచారంగా ఉన్న తనని చూసి అమ్మ అడిగితే, తనకా సంబంధం ఇష్టం లేదనీ, రెండు రోజుల్లో అమెరికా వెళ్లిపోతాననీ చెప్పేశాడు. రెండు రోజుల తరువాత అమెరికా తిరిగివచ్చేశాడు.

✣ ✣ ✣

ఇది జరిగి సంవత్సరం అవుతోంది. శ్రీరామ్ తాత్కాలికంగా పెళ్లి విషయం మరిచిపోయాడు. కొన్నాళ్లపాటు పెళ్లిని వాయిదా వెయ్యాలనుకున్నాడు. ఇదిగో... మళ్లీ అమ్మ నుంచి ఫోన్ రావడంతో ఏం చెయ్యాలో అతనికి పాలుపోవడం లేదు. తన ఛాంబర్‌లో కూర్చొని ఆలోచించసాగాడు.

తనకా ఇరవై ఎనిమిదేళ్లు వచ్చేస్తున్నాయ్ ఇంకా పెళ్లి చేసుకోకుండా ఎన్నాళ్లుండ గలడు?


తను అమ్మానాన్నలకు ఒక్కడే కొడుకు. ఏ విధమైన బాదరబందీలూ లేవు. వాళ్లు కూడా తనకు త్వరగా పెళ్లి చేసేసి తమ బాధ్యత తీర్చుకోవాలనుకుంటున్నారు.

అదీ గాక, ఈ రోజుల్లో బాపు బొమ్మలు, అందునా పొడవైన వాలుజడల అమ్మాయిలు ఎక్కడ దొరుకుతారు? ప్రపంచం చాలా

మారిపోయింది. అంతా ఆధునికతే. అమ్మాయిలందరూ పబ్‌లకు వెళుతుంటే ఇంకా వాలుజడ, లంగా ఓణీల అమ్మాయిలు ఉంటారా అని! అది ఎండమావిలో నీరే..

చివరగా అతనో నిర్ణయాని కొచ్చాడు, ఈ సారి ఇండియాకి వెళ్లి తనకు కాక, అమ్మకి నచ్చిన సంబంధం చేసుకుంటే సరి. ఓ పనైపోతుంది. జీవితంలో ఎన్నిటితోనో రాజీపడుతున్నాం, అందులో ఇది కూడా ఒకటి. మర్నాడే ఇండియా వెళ్లడానికి టిక్కెట్ రిజర్వ్ చేయించుకున్నాడు.

✣ ✣ ✣



శ్రీరామ్ ఇండియాకి వచ్చిన తరువాత, సువర్చల బిజీ షెడ్యూల్ తయారుచేసింది. ఈ సారి ఎలాగైనా కొడుక్కి పెళ్లి చేసి అమెరికా పంపాలని ఆమె ఆలోచన. అతను నెల రోజులు సెలవు పెట్టాడు. ఈ నెల రోజుల్లోనే అన్నీ జరిగిపోవాలి.

వెళ్లిన నాలుగు రోజుల్లో మూడు సంబంధాలు చూశాడు. ఆ మర్నాడే నాలుగో అమ్మాయిని చూడ్డానికి బయలుదేరారు. తన కెందుకో ఈ సంబంధం ఖాయం అవుతుందనిపిస్తోంది.

ఆ అమ్మాయి ఫోటోలోనే చాలా అందంగా ఉంది. పేరు ప్రణవి. చాలా మంచి పేరు. వాళ్ల నాన్నగారు స్టీల్ ప్లాంట్‌లో మేనేజర్. ఒక్కర్తే అమ్మాయి. యూనివర్సిటీ కాలేజీలో ఎమ్మెస్సీ చదువుతోంది.

పెళ్లిచూపులు ప్రారంభమయ్యాయి. ఆ అమ్మాయి ఫోటోలో ఉన్నట్లు ఎదురుగా చూసేందుకూ అందంగానే ఉంది. ముఖ్యంగా ఆమెది పొడవైన జడ.

సువర్చల ఆ అమ్మాయిని ప్రశ్నిస్తోంది. "సంగీతం నేర్చుకున్నావా?"

"నేర్చుకుంటున్నాను."

"వంట చెయ్యడం?"

"వచ్చు."

"నీ కిష్టమైనవేమిటి?"

"పుస్తకాలు చదవడం, ముగ్గులు వెయ్యడం, తోటపని."

ఆమె అభిరుచులు విని చాలా సంతోషించాడు శ్రీరాం. అన్నీ బాగున్నాయి, కానీ తను క్రితంసారిలా మోసపోకూడదు. ఆ జడ నిజమైనదో కాదో, తేల్చుకోవాలి. అంతవరకు ఆ అమ్మాయి నచ్చిందని చెప్పదల్చుకోలేదు. అతనో నిర్ణయానికొచ్చాడు.

000

మర్నాడు పది గంటలకు యూనివర్శిటీ కేంపస్‌లో సైన్స్ కాలేజీ దగ్గర మాటువేశాడు. పక్కనే ఉన్న చెట్టు కింద నిలబడి వచ్చేపోయే స్టూడెంట్స్‌ని గమనించసాగాడు.

అతను వచ్చి గంటకు పైగా అయింది. కానీ ప్రణవి కనిపించలేదు. బహుశా వాళ్ళకి ఈ రోజు సెలవేమో! ఇంకా ఓపిగ్గా ఎదురుచూస్తున్నాడు శ్రీరాం.

సుమారు పన్నెండు గంటలవుతుండగా అప్పుడు కనిపించిందామె. ఆమె ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసివస్తోంది.

వాళ్లని చూడగానే, శ్రీరాం తను కనిపించకుండా చెట్టు పక్కన నిలబడ్డాడు. కాసేపటికి వాళ్లు తనకి ఎదురుగా వచ్చారు.

ముందుగా ఆమె, తరువాత నల్లని పొడవైన వదులైన జుట్టు పిరుదుల దాకా ఉంది. ఆమె వదులుగా జుట్టుని దువ్వుకొని రబ్బరు బ్యాండు పెట్టుకున్నట్లుంది.

అది చూసి శ్రీరాం 'హమ్మయ్యా' అని ఊపిరి పీల్చుకున్నాడు అమ్మాయిది నిజమైన జుట్టే! అవును, అతని కల తీరబోతోంది. వాళ్లు పూర్తిగా వెళ్లిన తరువాత, తనని వాళ్లు గమనించకుండా ఇంటి దారి పట్టాడు శ్రీరాం.

ఆ తరువాత మిగతా కార్యక్రమాలన్నీ చాలా త్వరత్వరగా జరిగిపోయాయి. పదిరోజుల్లో శ్రీరాం, ప్రణవిల వివాహం రంగరంగవైభవంగా జరిగిపోయింది.

✣ ✣ ✣

ఆ రోజు శ్రీరాం, ప్రణవిల మొదటి రాత్రి.

శ్రీరాం ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్న రాత్రి...

ఆ రూం చాలా అందంగా అలంకరించివుంది. అగరొత్తుల వాసన గది నిండా వ్యాపించింది. మల్లెలు, జాజులు, ధవనం, మరువం-అన్నీ కలగలిపి కూర్చిన దండలు ఒక మత్తయిన, గమ్మత్తయిన ఆలోచనల్ని రేకెత్తిస్తున్నాయి.

శ్రీరాం పందిరి మంచం మీద కూర్చుని ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

"ధీరసమీరే యమునాతీరే వసతివనే వనమాలీ. గోపీపీనపయోధరమర్దన చంచలకరయుగశాలి" టేప్ రికార్డర్ లోంచి మంద్రంగా వినిపిస్తోంది.

నిజంగా ఎదురుచూపులే ఎంతటి ఆనందం...! విరహవేదనని అనుభవిస్తేనే తెలుస్తుంది.

రాత్రి పదవుతుండగా ప్రణవి లోపలికొచ్చింది. తెల్లని పట్టు చీరలో దేవకన్యలా మెరిసిపోతోంది. జడకు అల్లుకున్న తీగలా మల్లెల దండ... ఆమె లోనికి రాగానే ఒక మెరపు మెరిసినట్లయింది.

ఆమె వస్తూనే "సారీ! ఒంటికి అతుక్కున్నట్లు ఈ చీర, మేకప్‌తో చాలా చికాకుగా ఉంది. కొంచెం ఫ్రెషప్ అయివస్తాను" అంటూ బాత్ రూంలోకి వెళ్లింది.

శ్రీరాంకి మళ్లీ ఎదురుచూపే! అతను కలల్లో విహరిస్తున్నాడు

తన జీవితంలోకి ఓ కొత్త వ్యక్తి ప్రవేశించబోతోంది. ఎంతటి మంచిరోజు ఈ వేళ! ఆ రాత్రి తామిద్దరూ ఒక్కటై, తరువాత ఇద్దరిదీ ఒకటే మాటై, జీవితాన్ని హాయిగా మలచుకోవాలి.

ఈ లోగా బాత్ రూం తలుపు తెరుచుకుంది. ఆమె లోనికి వచ్చింది...

కానీ ఆమె... ఆమె.. ఆమేనా!?

చూస్తుండగానే శ్రీరాం షాక్ తిన్నాడు.

ఆమె ఆ చీర, పూలజడ అన్నీ తీసేసి నైట్ డ్రెస్‌లో ఉంది. ముఖ్యంగా ఆమె పొడవైన జడ స్థానంలో మెడ దాకా కత్తిరించిన జుట్టు.

అతడు ఆమెని భయంగా చూస్తూ "నీ జడ... నీ జడ ఏమైంది"? అన్నాడు.

"ఓ! అదా! ఎలాగూ మనం అమెరికా వెళ్లిపోతాం కదా! అక్కడ ఈ పొడవు జడని చూస్తే నవ్వుతారట కదా! పొడవైన జడ వోల్డ్ ఫాషన్ అని అందరూ చెబితే, నిన్ననే బ్యూటీ పార్లర్‌కి వెళ్లి కట్ చేయించుకున్నాను. ఇప్పుడు బాగుందా?"

ఆమె మాటలు పూర్తిగాక ముందే అతను మంచం మీద నుంచి కింద పడిపోయాడు.